

డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి
ఎం. ఎ. పిహెచ్. డి.

జననము : 15—2—1953

స్థలము : ఉప్పులూరు (కృష్ణాజిల్లా)

తల్లిదండ్రులు : వెంకటనరసమ్మ, వెంకటరామశాస్త్రి

ఉద్యోగము : ఆంధ్రోపన్యాసకులు,
శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాల,
పొన్నూరు.

ఇతర రచనలు : " శ్రీరామకథామృతము - సమగ్ర సమీక్ష "
ఆంధ్ర విశ్వవిద్యాలయమువారిచే డాక్టరేట్ పొందిన
పరిశోధన నిబంధము.

" రామాయణము - సమాజదర్పణము "

శ్రీ మద్రామాయణ వైభవము

రచయిత :

డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి
ఎం. ఎ. పిహెచ్. డి.

సర్వస్వామ్యములు రచయితవి.

ప్రతులు : 1000

జూన్ '87

ఉత్తమగ్రంథ ప్రచురణ సహాయార్థము

వెల : రూ. 3-00

ప్రతులు లభించుచోటు :

శ్రీ తూములూరు లక్ష్మీనారాయణశాస్త్రి
సిద్ధాంతిగారు

ఆ ది త్య జ్యో తి షా ల య మ్

ఉ ప్పు లూ రు (P. O.)

(Via) కంకిపాడు (కృష్ణా జిల్లా)

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్॥

శ్రీ మ ద్రా మా య ణ వై భ వ ము

విశ్వమున కాధారము ధర్మము. ఆ ధర్మమును ప్రతిష్ఠించునది వేదము. వేదవేద్యుఁడగు పరమపురుషుఁడు దశరథాత్మజుఁడుగా నవతరింప నా పురుషోత్తముని వర్ణించు వేదము వాల్మీకి ముఖమున శ్రీమద్రామాయణముగాఁ బరిణమించినది.

వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥ 2

ఈ రామాయణ మహాకావ్యావిర్భావ సందర్భముననే పూర్వమున్న వైదికఛందస్సునకుఁ దోడు లౌకికఛందస్సు నుదయించినది. ద్రష్టయగు వాల్మీకి మహర్షి కవియై వెలసినాడు.

ప్రపంచమునఁ గావ్య ప్రపంచమున ప్రసిద్ధిఁబడసి యనంత కళ్యాణ గుణాభిరాముఁడగు శ్రీరాముని చారిత్రము వర్ణించునదై సాహిత్యమున నగ్రస్థాన మలంకరించినది రామాయణము. వాల్మీకియే చెప్పినట్లు "పరం కవీనా మాధారమ్" గు నీ రామకథ సంస్కృతమున వెలసి ప్రపంచభాషలన్నింటిలోకి ననువదింపఁబడి భారతదేశమున దేశభాష లన్నింటి యందును ననేక ప్రక్రియలలోఁ గీర్తింపఁబడి శ్రీరామకథ సర్వజగద్రక్ష" గాఁ బరిణమించి "వాఙ్మయము రామమయము" అను నంతగా నభివృద్ధి గాంచినది. సంస్కృతముననే రామకథ కావ్య నాటక చంపూ వచన రచనాది భిన్నప్రక్రియలలో వెలువడినవి. వాల్మీకమునకుఁ బెక్కు వ్యాఖ్యానములు రచింపఁబడినవి. అంతియేగాక ప్రాచీనార్వాచీన ప్రాచ్యపాశ్చాత్య కవిపండితులు వాల్మీకిని, నాతని రామాయణమును బహుధా ప్రశంసించినారు. వారిలో

2. అగస్త్యసంహిత.

"వాల్మీకి నాదశ్చ స సర్జపద్యమ్" [1] అని యశ్వఘోషుడును;

"స్వకృతిం గాపయామాస కవిః ప్రథమ పద్ధతిమ్" [2] అని

కాళిదాసును ,

"అథ భగవాన్ ప్రాచేతసః ప్రథమం మనుష్యేషు శబ్దబ్రహ్మణ

స్తాదృశం వివర్తమితిహాసం రామాయణం ప్రణినాయ" [3] అని

భవభూతియు.

భాస్వద్వంశ వతంస కీర్తి రమణీ రంగప్రసంగస్వన

ద్వానత్రి ప్రథమధ్వనిర్విజయతే వల్మీక జన్మామునిః [4]

అని జయదేవుడును :

శుభమతనుతకావ్యం స్వాదురామాయణాఖ్యం

మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షిః [5]

చేతసోఽస్తు ప్రసాదాయ

సతాం ప్రాచేతసో మునిః

పృథివ్యాం పద్యనిర్మాణ

విద్యాయాః ప్రథమమ్ పదమ్ [6]

అని గంగాదేవియు వేనోళ్ళ ప్రశంసించెను. మురారి శ్రీమద్రా

మాయణమును "వాల్మీకి వాగమృతకూప" [7] మని సంభావించినాడు.

సదూషణాఽపి నిర్దోషా సఖరాఽపి సుకోమలా

నమస్తస్మై కృతాయేన రమ్యా రామాయణీ కథా.

1. సౌదరనందమ్ 2. ర. వం. - 15 స., 31 శ్లో.
3. ఉ. రా. చరితమ్ - 2 అం., 5 శ్లో. క్రింది పంక్తులు.
4. ప్ర. రాఘ. - 1 అం., 9 శ్లో. 5. రామాయణ చంపూః
6. మధురావిజయమ్. 7. అన. రాఘ. - 1 అం., 12 శ్లో.

అని నలచంపూ వ్రాసిన త్రివిక్రమభట్టు నంజలి ఘటించినాడు.

లౌకికానాంహి సాధూనాం అర్థం వాగనువర్తతే ।

ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోను ధావతి॥ [1]

అని భవభూతియే భగ్యంతరముగా వాల్మీకి మహర్షికి వాచికార్చలు సమర్పించినాడు.

ఇందఱన్ని విధములఁ బ్రస్తుతించిన రామాయణేతివృత్తమునకు శ్రీరాము నుదాత్త నాయకత్వము సిద్ధించుట మిక్కిలి హర్షింపదగిన విషయము.

శ్రీరాము నుత్తమగుణములు వాల్మీకినే గాక తరువాతి కవులను విశేషముగా నాకర్షించినవి. కావుననే మురారి -

యదిక్షుణ్ణం పూర్వైరితి జహాతి రామస్యచరితమ్

గుణైరేతావద్భిర్జగతి పునరన్యో జయతికః

స్వమాత్మానం తత్తద్గుణగరిమ గంభీర మధుర

స్ఫురద్వాగ్బ్రహ్మణః కథముపకరిష్యన్తి కవయః [2]

అనియు, జయదేవుడు -

స్వసూక్తీనాం పాత్రం రఘుతిలకమేకం కలయతాం

కవీనాంకో దోషస్సతుగుణగణానామవగుణః

యదేతైర్నిశ్శేషై రపరగుణలుబ్ధై రివజగ

త్యసావేకశ్చక్రే సతత సుఖసంవాస వసతిః [3]

అనియు రాముని గుణగణములను బ్రశంసించిరి. "రామాదివద్వర్తితవ్యమ్, నరావణాదివత్" అని యాలంకారికులు లక్షణ నిర్ణయము దీనినిబట్టియే గావించిరి. వాల్మీకి -

1. ఉ. రా. చరితమ్ / అం. 2. అన. రాఘ. - అం, 9 శ్లో.
3. ప్ర. రాఘ. - 1 అం., 12 శ్లో.

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితం
యఃపఠే ద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే [1]

అనుటనుబట్టి రామాయణముయొక్క పుణ్యగుణకీర్తనము, వేదసమ్మితమైన కావ్యస్వభావము, కావ్యపఠన ఫలమును మనోజ్ఞముగా వర్ణింపబడినవి. ఇట్టి రామాయణమును సహృదయులు రసదృష్టితోడను, శాస్త్రజ్ఞులు శాస్త్రదృష్టితోడను, తాత్త్వికులు తత్త్వదృష్టితోడను వీక్షించి యా యా రహస్యములను బరమార్థములను బొందగల్గినారు. రామాయణ పరమార్థమును గూర్చి డా॥ ఇలపావులూరి పాండురంగారావుగారు "కథగా చూచినా, కావ్యంగా భావించినా, నీతి సంహితగా నిర్వచించుకున్నా, యోగశాస్త్రంగా అన్వయించుకున్నా రామాయణం సారస్వత పారిజాతంగా గోచరిస్తుంది. సామాన్య జనులకు అది చక్కని కథ. రసజ్ఞులకు అది రమణీయమైన కావ్యం, నీతికోవిదులకు నీతిశాస్త్రం, యోగులకు యోగశాస్త్రం, మంత్రసాధకులకు మంత్రరాజం, ఇలా ఏ దృష్టితో చూస్తే అలా గోచరించే పలువన్నెల భవ్యచిత్రాన్ని ఇంద్రధనస్సులాంటి ఈ ఉద్గ్రంథం ప్రపంచానికి అందిస్తూ ఉంది" [2] అని వివరించినారు. నెమలి పింఛము వలె విశ్వసౌందర్యమును బ్రదర్శించిన మహాకావ్యము రామాయణము. ఇందలి కథ అతి లోక రమణీయమైనది. వివిధ పాత్రలతోఁగూడి స్వర్గమర్త్య పాతాళముల వ్యాపించి సర్వవిధములగు చిత్తవృత్తులకు నానందరస పరిణామమును గల్గించు నుత్తమోత్తమ కావ్యమీ రామాయణము.

లోకమున చతుర్విధ పురుషార్థము లవశ్యముపాదేయములు కాఁగా వందుఁ గేవల మర్థకామములు పరిత్యాజ్యము లగుచున్నవి.

1. బాం. కాం. - 1 స., 98 శ్లో. 2. "రామాయణ పరమార్థం", 65 పు.

కానిచో నది రాక్షసత్వమును బ్రబలజేయును. ధర్మోపబృంహితము లగుచో నర్థకామములు గ్రాహ్యములగుచున్నవి. పరిపూర్ణమానవత్వమున కది నిదర్శనము. అర్థకామములు గౌణములు చేసి, ధర్మోపాసన నలుపుట పరమార్థము. దైవీసంపద కది మార్గము. రామాయణ మీ మూఁడింటిని బ్రదర్శించుచున్నది. వాల్మీకియే దీనినిట్లు ప్రవచించినాఁడు.

కామార్థగుణసంయుక్తం ధర్మార్థగుణవిస్తరమ్
సముద్రమివ రత్నాఢ్యం సర్వశ్రుతి మనోహరమ్ [1]

శోకజనితమగు శ్లోకము రామాయణ కావ్యరచనకు మూలము కాఁగా సీతాత్యంత వియోగపర్యంత ముపవర్ణితమగు నా కావ్యము శోకము స్థాయిగాఁ గల్గిన కరుణరసప్రధానమని శ్రీయానందవర్ధనాచార్యులు, మొదలగువారు భావించిరి. అభినవగుప్తుడును తన లోచన వ్యాఖ్యలో విప్రలంభశంకఁ బరిహరించి కరుణరసమే యని నిరూపించినాఁడు. [2] వక్రోక్తికారుఁడగు కుంతకుఁడు మాత్రము తనకుఁ బూర్వులగు వారిచే "రామాయణము శాంతరస ప్రధానమగు కావ్యము" గా నంగీకరింపఁబడినట్లు వర్ణించినాఁడు. అట్లయిన నతని వాదమున నవతారోప సంహారమును దెలుపు శ్రీరాముని మహాప్రస్థానము వరకు వాల్మీకి కృతమే యని సంభావింపఁబడియుండనోపును.

"ధర్మోహి పరమోలోకే" [3] - ప్రకృతి తన యనంత వ్యాపారములను ధర్మము ననుసరించియే కొనసాగించుచున్నది. లోకప్రతిష్ఠాహేతు వగు ధర్మమును భంజింపరాదు. ధర్మభంగము వలనఁ బ్రకృతి వ్యత్యస్తమై విపరీత మేర్పడును. అట్టి ధర్మము సర్వథా రక్షింపబడవలయును. రావణకౌర్యపరితప్తము లయిన లోకము లందు గానిఁ

1. బా. కాం. - 3 స., 8 శ్లో. 2. ధ్వ. లో.-4 అ., 10 శ్లో. కారికావృత్తి
3. వా. రా.- బా. కాం.- 40 స. ,21 శ్లో.

దొలగించి జగద్ధితముగా ధర్మమును సుప్రతిష్ఠిత మొనరింప రామావ తారము జరిగినది. వైదికధర్మము సర్వథా రామాయణమునఁ బ్రతి పాదింపబడినది. అది యొక ధార్మిక గ్రంథముగానే కాక రసానంద జనిత మగు నుత్తమ కావ్యముగాను, మన దేశ పూర్వచరిత్రను, సంస్కృతిని దెలుపు చారిత్రక సత్యముగాను, నాటి సాంఘిక జీవన మునుబోధించుసాంఘికశాస్త్రముగాను నెన్నఁదగియున్నది. సామాన్య విశేష ధర్మములు రెండును రామాయణమునఁ బ్రతిపాదింపఁబడినవి. మొదటిది సమాజమునకు హితము గూర్చు సత్ప్రవర్తనమును, రెండవది శాశ్వతానందమును గూర్చు జీవబ్రహ్మైక్యమును వివరించుచున్నవి

లక్ష్మణునిఁ బ్రబోధించుచు రాముఁడు "అర్థకామాదులు లేని ధర్మమును భజింపవలె ననియు, ఏది ధర్మమో దాని నాచరింపవలె ననియు, కేవల మర్థకామములు దూష్యము" లనియు వివరించినట్లు వర్ణింపఁబడుట కావ్యోపదేశముగా నెన్నదగియున్నది.

యస్మింస్తు సర్వే స్స్యు రసన్నివిష్టా, ధర్మో యతస్స్యాత్ తదుపక్రమేత
ద్వేష్యో భవత్యర్థపరోహి లోకే, కామాత్మతాఖల్వపి నప్రశస్తా [1]

అర్థపరురాలైనకైక, కామపరుఁడైనరావణుఁడు లోకనిందనను భవించి కష్టనష్టముల నందుట ప్రసిద్ధము. ధర్మపరుఁడైన రాముఁడు "రామోవిగ్రహవాన్ ధర్మః [2]" అని మిక్కిలిగా కీర్తింపఁబడినాఁడు.

వాల్మీకిమహర్షి రామాయణము నూహించి రచించుటయేగాక తానునునందొక పాత్రయై సమకాలీన సమాజమునకు ఆ గావ్యమునుఁ బ్రతిబింబముగాఁ దీర్చిదిద్దినాఁడు. ఆనాటి సమాజమున సహజములగు సంఘటనలు నేఁటి దేశకాల సంస్కృతి విశేషములనుబట్టి యసహజ ములుగను,నతిలోకములుగనుదోఁచుచున్నను. కావ్యాధ్యయనందుఃగు లగు సహృదయులు వీని నన్నింటి నాకాలముననుసరించి యవగాహన

1. వా. రా. - అయో కాం.- 21 స., 58 శ్లో.
2. వా. రా. - అర. కాం., 37 స., 13 శ్లో.

మొనర్చుకొనవలసినదే గాని యన్యథా వ్యాఖ్యానించు టుచితముకాదు.

ఇక్ష్వాకూణామిదంతేషాం రాజ్ఞాం వంశే మహాత్మనాం
మహదుత్పన్నమాఖ్యానం రామాయణ మితిశ్రుతమ్
తదిదంవ ర్తయిష్యామి సర్వం నిఖిలమాదితః
ధర్మకామార్థ సహితం శ్రోతవ్యమనసూ యయా

బా. కాం. - 5 స., 3, 4 శ్లోIIలు.

అని వాల్మీకియే స్వయముగా విన్నవించుకొనినాఁడు. ఏబదియరువ దేండ్ల క్రిందటి సాంఘిక జీవనమునకును, నిప్పటికిని యూహింపని తీవ్ర పరిణామములు జరిగినరీతి నిప్పటికిని వయోవృద్ధులు వివరించుట యనుభవసిద్ధమగు విషయమేగదా! వానిఁ దలచినప్పుడు విస్మయము గల్గుట సహజము. అది యుగయుగముల నాఁటి సంస్కృతి. వైదిక ధర్మ మందుల కాలంబనము. ఆ రామాయణ కాలమున దేవతలు స్వయముగా విచ్చేసి లోకసంగ్రహణమునకై ఋషులఁ బ్రోత్సహించుట, యజ్ఞముల హవిస్సులు గొనుట, వరములు బ్రసాదించుట జరిగెడివి. పితృదేవతలు దర్శనమిచ్చి కర్తవ్యమును బోధించెడివారు. ఎల్లరును ధర్మకర్మముల, నిత్యానుష్టాన తపోయజ్ఞములను గావించు చుండెడివారు. దేవలోకమున యథేచ్ఛగా రాకపోకలు సాగుచుండెడివి. ప్రజలు స్వామిభక్తి కలిగి సత్యవ్రతములు నెఱపుచు సుఖ సంపదలతో నలరుచుండెడివారు, స్త్రీలు పతివ్రతలై యుండెడివారు. రాజ ధర్మము, గురుశిష్య సంప్రదాయము సుసంపన్నములైనవి. ఇట్టి రామాయణము విశ్వజనీనమైన కావ్యము. స్వర్గ మర్త్య పాతాళలోక ములే కథకు రంగములై ప్రవర్తిల్లినవి నరులు, వానరులేగాక దేవ దానవులు మఱియుఁ బంచభూతాత్మకమగు చరాచర సృష్టిసమస్తము నీ కావ్యమునఁ బాత్రలై విలసిల్లినవి. అయా ఘట్టముల నవరసములు

మనోహరముగాఁ బోషింపఁబడినవి. ఇన్ని పాత్రలున్న యీ కావ్యమున నేపాత్ర కాపాత్ర ప్రత్యేకత వెల్లడియగునట్లు స్వరూపస్వభావ చేష్టాదికములు సుసూక్ష్మముగా సునిపుణతతోఁ జిత్రింపఁబడినవి. అనేకములగు కావ్య శిల్పకళారహస్యములు ప్రదర్శింపఁబడి రామాయణ మనంతరకవుల కనుసరణీయమైనది. ఆ విషయమై వాల్మీకి యిట్లు వ్రాక్రుచ్చినాఁడు.

ఆశ్చర్య మిదమాఖ్యానం మునినా సంప్రకీర్తితం
పరం కవీనా మాధారం సమాప్తంచ యథాక్రమమ్ ।

— బా. కాం. - 4స., 20 శ్లో.

"కాళిదాసాది మహాకవుల కావ్యములందుఁ బ్రత్యేకగుణములుగాఁ బరిగణింపఁబడు విశిష్ట కవితారీతు లన్నింటికి మూలము శ్రీమద్రామాయణ మహాకావ్యమే యని సతత కావ్యాధ్యయన శీలురగు సహృదయులు నుడువుట విమర్శకాగ్రేసరు లంగీకరించిన సత్యము"[1] అని శ్రీ రాచకొండ నరసింహమూర్తిగా రనుట సంభావనీయము.

ఇతివృత్త నిర్వహణము :

రాముని బాల్యమునుండి రావణ వధాపర్యంతము వర్ణింపఁబడిన షట్కాండ పరిమితమగు పూర్వరామాయణము నందు వాల్మీకి పురుషోత్తముఁడగు రాముని మానవునిగనే చిత్రించినాఁడు. అట్టిది లోకమున కాదర్శమై నెగడినది. అందాతని కాత్మ విష్ణుత్వజ్ఞానము లేదు. అట్లుండుట బ్రహ్మ రావణున కిచ్చిన వరములకుఁ బ్రతిబంధకము. అట్టియెడ నవతార ప్రయోజనము శూన్యమగును. కావున నంతవరకు విశ్వామిత్రాదులగు ఋషులకే కొద్దిమందికో రాముఁడు విష్ణువు నవ

1. కంకంటి ఉత్తరరామాయణ పరిశోధనా వ్యాసము.

తారమని తెలియునని చెప్పవచ్చును. అట్లు తెలియుటలో తప్పులేదు. ఆత్మవిస్మృతి మానవత్వమును సూచించును. అట్టి మానవత్వ చిత్రణమున నుత్తమ గుణములనేకాక సహజ దౌర్బల్యములను గూడ వర్ణించి వాల్మీకి సహజత సంపాదించినాఁడు. సీతాగ్నిప్రవేశ సందర్భమున దేవతలు నీవే శ్రీహరివని నెత్తిన నోరు వెట్టుకొని యెంతగా మొత్తుకొనినను "ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్."[1] అని పలికినాఁడు. ఉత్తరకాండమునఁ బట్టాభిరాముని జూడవచ్చిన యగస్త్యుఁడు రావణాదుల పూర్వవృత్తాంతము వివరించి యా యా యవతారములలో లోకరక్షణ మొనరించిన "శ్రీహరివి నీవే" అని నిరూపించుచు రాముని యందాత్మ విష్ణుత్వజ్ఞానము క్రమోన్మీలనము గావించినాఁడు. పితామహుని ప్రేరణమున యముఁడు తాపసవేషమున రాఁగా వానితో సర్వము నెఱింగినవాని వలె నవతారోపసంహారమునకు దన సంసిద్ధతఁ దెలియఁజేసినాఁడు.[2] "యోఽహం యస్య యతశ్చాహం భగవాం స్తద్బ్రవీతుమే"[3] అను రాముని ప్రశ్నకు సమాధానమీ యగస్త్యుని కథనము. ఇట్టి గంభీరమగు నితివృత్త నిర్వహణమున వాల్మీకి ప్రదర్శించిన చాతుర్యము బహుధా ప్రశంసనీయమైనది. ఇందాధునికులు నిర్వచించు నితివృత్త మధ్యమునఁ బూర్వకథా కథన రూపమగు పద్ధతి నిర్వహింపఁబడినది. పూర్వ రామాయణమున రాముఁడవతరించి యుద్ధతుఁడగు రావణుని సంహరించిన విధము వర్ణింపబడి, రావణుని జననాది వృత్తాంతములు, వరములు, వాని యౌద్ధత్యము, నుత్తర రామాయణమున వర్ణింపబడినవి. రావణాదుల సంహరించిన రాముని స్వరూప ముత్తరకాండమున రావణాదుల

1. యు. కాం. - 120 స., 11 శ్లో. 2. ఉ. కాం. - 104 స., 17 - 19 శ్లో. లు
3. యు. కాం - 120 స., 11 శ్లో

పూర్వవృత్తాంత కథనానంతరమున సహృదయుని హృదయమున విశిష్టముగ గోచరించుట యనుకథవైక వేద్యము.

ఇఁక నుత్తరరామాయణము పూర్వరామాయణమునకుఁ గేవలము ఖిలగ్రంథముగాఁ గాక పూర్వరామాయణము నందలి పాత్రలగు రావణ కుంభకర్ణాది రాక్షసుల యొక్కయు, వాలి సుగ్రీవాంజనేయాది వానరులయొక్కయు, జన్మవృత్తాంతములతోఁ బాటు ప్రధాన కథకు సంబంధించిన రామకృత సీతాపరిత్యాగము, కుశలవుల వృత్తాంతము, సీతాకృత భూప్రవేశము, లక్ష్మణ పరిత్యాగము, రాముని మహాప్రస్థానము మొదలగునవి యుత్తర రామాయణేతివృత్తములుగా వర్ణింపఁబడినవి. ఇట్లు పూర్వోత్తర రామాయణ కథాభాగములు రెండును గలసి కావ్య పరిపూర్ణతను సంతరించుకొని కృత్స్న రామాయణముగాఁ బరిగణింపఁబడినవి.

కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్
పౌలస్త్య వధమిత్యేవం చకారచరిత్రవ్రతః

- బా. కాం. - 4 స., 7 శ్లో.

పాత్రల స్వరూప స్వభావ వైచిత్రి :

ముల్లోకముల నాక్రమించిన యీ కావ్యేతివృత్తము సమస్తసృష్టి జాతమును పాత్రలుగా సంగ్రహించినది. ఇందు పశుపక్ష్యాదుల యొక్కయు, నర వానరుల యొక్కయు, దేవ దానవ యక్షరాక్షసుల యొక్కయు, విచిత్ర చిత్తవృత్తులతోఁ బాటు తేజోబల వైభవ ప్రాభవములు సునిరూపితములైనవి. ఇట్టి కావ్యము సృష్టి వైవిధ్యమును ప్రకటింప సమర్థమగుచున్నది.

వాల్మీకి నారదుల సంవాదమునఁ బేర్కొనఁబడిన "గుణవాన్ కశ్చవీర్యవాన్" ఇత్యాది యుత్తమ గుణములు పదునారింటికిని రాముఁడు లక్ష్యభూతుఁడు. అట్టి గుణగణసంస్తవమే విపులమగు రామాయణ మహాకావ్యము. ఇందాతని యాదర్శమానవత్వము, సీతా పాతివ్రత్యము బహుధా కీర్తింపఁబడినవి. "రామ రామయో రయనం రామాయణమ్" అను నర్థమున వాల్మీకి కృతిని రామాయణ మనుటయే గాక సీతామహచ్చరితముగాఁ గూడ వ్యవహరించుట యౌచిత్యసుందరము.

పాపానాం శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ।
కార్యం కరుణమార్యేణ న కశ్చి న్నాపరాధ్యతి॥ 1

అని తన్ను హింసించిన రాక్షసీబృందమును సహితము హింసింప వలదని కరుణించిన మృదుహృదయ సీత. "ఏకస్య మరణం మేఽస్తు మాభూత్సర్వ వినాశనమ్"[2] అని లోకహితము గోరి యాత్మార్పణముఁ జేయఁ జాలిన త్యాగశీలి లక్ష్మణుఁడు "సహి కల్యాణ చారిత్రః కైకేయ్యానందవర్ధనః" అని ప్రశంసింపఁబడినవాఁడు భరతుఁడు. శత్రుఘ్నుఁడు శత్రుఘ్నుఁడు. ప్రఖ్యాత బల పౌరుషశాలి వాలి. రావణుఁడు లోకవిద్రావణుఁడు. "ధర్మో రక్షతి రక్షితః" అని నిరూపించినవాఁడు విభీషణుఁడు. అపూర్వ ఘోరదర్శనులు కబంధ విరాధులు. తాటక, శూర్పణఖాది రాక్షసీస్వభావము లోకవిలక్షణము. దశరథుని మిత్రుఁడు జటాయువు పరోపకార పరాయణుఁడు. ధర్మతత్పరుఁడయ్యు, రాజశాసనమునకు బద్ధుఁడై యనుసరించిన విచిత్ర చరిత్రుఁడు కుంభకర్ణుఁడు. విభీషణ కుంభకర్ణులు రావణసోదరు లయ్యు స్వభావముచే వైవిధ్యమును బ్రదర్శించిరి. దశరథుఁడు, వాని పట్టపురాణులుఁ బరమ పురుషుని సంతతిగాఁ బడసిన మహితచరితులు. సుమంత్రుఁడు మంత్రిసత్తముఁడు.

1) యు. కాం. - 116 స., 44 శ్లో. 2) ఉ. కాం. - 105స., 9 శ్లో.

శబరి ముగ్ధత, యాంజనేయుని ప్రభుభక్తి, కార్యదీక్ష, దక్షత, గుహుని సౌమనస్యము, సుగ్రీవుని మైత్రి ప్రశంసార్హములైనవి. ఋష్యశృంగుని పాత్ర మొక యపూర్వసృష్టి. మండోదరీ, త్రిజటల పాత్రలు విశిష్టములైనవి. రామలక్ష్మణుల, వాలిసుగ్రీవుల, రావణ కుంభకర్ణుల సోదరభావములలో నర, వానర-అసుర ప్రవృత్తులు నిపుణముగా నిరూపింపఁబడినవి. నీలుఁడు రాళ్ళను నీటిపై దేల్చు విశేష సామర్థ్యము గలవాఁడు. స్వయంప్రభా వృత్తాంతమత్యంత సుందరము. రాముని చేతిలో నిహతులైనవారందఱు వికృతుల విడిచి యుత్తమ గతులను బొందిరి. మఱియు ననుయాయులు భక్తులు రామునితో మహాప్రస్థాన మొనరించి యుత్తమలోకముల నధిష్ఠించిరి. సృష్టిస్థితిలయ పరిణామమిందు సప్రమాణముగ నిరూపింపఁబడినది. "సర్వశ్రుతి మనోహరము", సర్వోపగమ్యము నగు శైలీ లాలిత్యములు వాల్మీకి రామాయణమునకుఁ బ్రత్యేక లక్షణములు.

రాముని యశ్వమేధయాగ సందర్భమున కుశీలవు లగు కుశలవుల వలన గానము సేయఁబడిన యీ రామాయణ కావ్యము సహృదయుఁడగు పాఠకున కొక్కసారిగ మొదటినుండియు మధురమగు సంగీత రూపకముగఁ దలపునకువచ్చి హృదయమునఁ బ్రతిధ్వనించుచుండును. ఎవరెన్నిమారులీ కావ్యసౌందర్యమును బరామర్శించినను నింక నెన్నియో విశేషములతో నవ్యార్థస్ఫురణల సంభావ్యమై యలరారుచున్నది. కావుననే శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు "రామాయణ భారతములు సముద్రములు. ఏదో యొక తీరము నుండి చూడగలుదుము. అంతయుఁ జూడఁజాలము" అని వక్కాణించినారు.[1]

శ్రీమద్రామాయణ వైశిష్ట్యమునెన్నుచు మల్లాది గోపాలకృష్ణ శాస్త్రి గారిట్లు పేర్కొనిరి - "రామాయణము నందంతటను వైదిక

1) శ్రీమద్రామాయణ వైభవము / పీఠిక / కుశీలవులు - గానవిశారదులు.

ధర్మ ముగ్గడింపఁబడినది. భార్యాభర్త, వారి సంతానము, బంధుమిత్రాది పరివారము, వారు పాలింప వలసిన వైయక్తిక, సామాజిక ధార్మిక నిర్వహణము, పాటింపవలసిన శమదమాదులు, నిత్యనైమిత్తికములగు సంధ్యాగ్ని-ఉపాసనలు, క్రతువులు, దేవాతిథి పితృపూజలు, ప్రతివారును ననుష్ఠింపదగిన సత్యపాలన, భూతదయ ప్రియభాషణము మొదలగునవి చక్కగా నిరూపింపఁబడినవి. మరియును పుత్రుడు - తండ్రి, యన్న - తమ్ముఁడు, స్వామి - సేవకుడు, గురువు - శిష్యుఁడు, భగవంతుఁడు - భక్తుఁడు, మిత్రుఁడు - మిత్రుఁడు, శత్రువు - శత్రువు నొండొరుల యెడ నెట్లు ప్రవర్తింపవలయునో బోధించునది రామాయణము.[1] "మానవజాతియొక్క విశేషించి భారతీయ సమాజము యొక్క / వారే మతమునకు, సంప్రదాయమునకు చెందినవారైనను సరియే / శీలచారిత్ర నిర్మాణమునకు ఉత్తమమైన సాధనము శ్రీమద్రామాయణ కావ్యసంహితయే. ఇంతకంటె నుత్తమ సాధనము మరియొకటి లేదనుట నిర్వివాదాంశము.[2]

శ్రీ కల్లూరి చంద్రమౌళిగారీ కావ్యప్రశంస గావించుచు "నైయక్తిక క్రమశిక్షణమును, సాంఘిక సమన్వయ పాలనమును, స్వరాజ్య, స్వారాజ్యములను సమకూర్చు సాధనములను, నాంతరంగిక శుభములనుఁ జేకూర్చు"[3] నని పలికిరి. ఈ విధముగ రామాయణము "విశ్వశ్రేయః కావ్యమ్" అనుటకు లక్ష్యభూతమై యొప్పుచున్నది.

"భాగవతం తెలుసుకోటానికి భక్తి, భారతం తెలుసుకోటానికి భక్తితోపాటు యుక్తి, రామాయణం తెలుసుకోటానికి భక్తియుక్తులే కాకుండా శక్తికూడా ఉండాలంటారు పెద్దలు"ని జోశ్యుల సూర్యప్రకాశరావుగారును తద్విశేషము నుగ్గడించుచు తమ "తెలుగు రామాయణాల రమణీయత"లో వివరించినారు.

1) శ్రీమద్రామాయణ వైభవము 2) శ్రీమద్రామాయణము - విశ్వశ్రేయము
3) రామాయణ సుధాలహరి

ప్రకృతి వర్ణనాపాటవము, మనస్తత్త్వ విశ్లేషణ, తత్తజ్జాతి స్వరూప స్వభావనిరూపణతోఁబాటు వాల్మీకి రామాయణమున తర్క-వ్యాకరణ వాస్తు జ్యోతిష శిల్ప సాముద్రిక నిమిత్తాదులైన యనేక శాస్త్రవిషయములు సందర్భోచితముగాఁ బ్రపంచన మొనరించినాఁడు. మఱియు సాంఘిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక విశేషము లెన్నియో యిందుద్బోధించినాఁడు. ఇవి యన్నియుఁ గావ్యవైశిష్ట్యము నినుమడింపఁజేయుచున్నవి.

మంత్రశాస్త్రము :

బ్రహ్మ నాదస్వరూపము. నాదము నుండియే యక్షరములు జనించినవి. అన్ని యక్షరములు మంత్రములే. మానవశరీరమున కనుగుణమై శబ్దాభివ్యక్తి కుపకరించునవియైన యక్షరములను సన్నిహితము గావించుకొని మననము చేయగా నవి మంత్రములగును. మంత్రమును జపింపగా నది పరావాక్కును స్పృశించును. అట్టిచో హృదయస్పందన మేర్పడును. అట్టి స్పందన బ్రహ్మ సంబంధమును గల్గించును. అదియే యానందానుభూతికి నెలవు. అట్టి హృదయస్పందనము గలిగించు ధ్వనులు వాల్మీకమునఁ గలవు. అది యాతని ఋషిత్వము వలన సిద్ధించినది. గాయత్రీ బీజాక్షరముల నిబంధించుట యందులకుఁ బ్రతీక. రామాయణ పఠనకాలమున నా ధ్వనితరంగములు తమ పని సేయ నారంభించును. నిజమునకు బ్రతి కావ్యమునను రసము, రసాలంబనమగు నాయకుఁడు, స్థాయి భావము నుండి, యాలంబనము భావమయమగునప్పుడు మనస్సు తద్రూపమును జెందును. అట్టి సందర్భమున యోగమునందు సిద్ధించు నేకాగ్రత సహృదయుఁడగు పాఠకునకు సిద్ధించును. విశేషించి రామాయణమున నట్టి సిద్ధి లభించుట యనుభవైకవేద్యము. కావున ననేకులు రామాయణము జదివి యట్టి స్పందన మనుభవించి రామకథ ననేకరీతుల వర్ణించిరి. మఱియు

యోగమున నుపాస్య దైవము నుపాసకునకు విభిన్న దశలలో, విభిన్న రూపములలో దర్శనమిచ్చునట్లు రామాయణమున రాముని రూపము వివిధ ఘట్టములలో వివిధ రీతుల దర్శనమిచ్చును. వాల్మీకి యా యా సందర్భములలో నిదమిత్థమని యంగాంగ వర్ణనఁ జేయలేదు. అట్టి వర్ణన సాధ్యము కాదు. అయినను సహృదయున కారూపము గోచరమగును. అట్టిది యపరిమితమైన మంత్రశక్తి వలన సిద్ధించును. ఇతర కావ్యము లందు కవి వర్ణించినది మాత్రమే గోచరించును. రామాయణమున - 1 బాలరాముఁడు, 2. కల్యాణరాముఁడు, 3. కోదండ రాముఁడు, 4. పట్టాభిరాముఁడు, 5. ధర్మప్రభువైన రాముఁడు, 6. మోక్షప్రదాత యగు రాముఁడు మొదలగు రూపముల రాముఁడు దర్శన మిచ్చుట హృదయంగమము. రామాయణము, రామాయణము నందలి భాగములు నిత్యపారాయణార్హములై నేటికిని పఠన పాఠనములలో నుండుట మంత్రత్వమునకు దద్వైభవమునకుఁ దార్కాణము. అందు సుందరకాండ, ఆదిత్యహృదయము మొదలగునవి ముఖ్యముగా నెన్నదగి యున్నవి.

రామాయణమున నన్ని కాండలలో సుందరకాండ మత్యంత సుందరము, సురుచిరమునై యలరుచున్నది. "ఆదికవి వాల్మీకి మునిచంద్రుఁడు సైతం ముచ్చటపడిన కాండ సుందరకాండ."[1] మహర్షి యా యా కాండలలో వర్ణితమైన కథాభాగాన్ని బట్టి పేరుపెట్టి "కిష్కింధా యుద్ధకాండల మధ్య జరిగిన విశేషాలకు సుందరకాండ అని నామకరణము చేయుట"[2] ఇందులకుఁ బ్రమాణము. అందు

1, 2 సుందరాకాండ - ఉపశ్రీ, పీఠిక, పు. 6

వర్ణింపఁబడిన త్రిజటాస్వప్నము గాయత్రీమంత్రము,[1] సుందరకాండ కుండలినీ యోగమే.[2]

మఱియు "గాయంతం త్రాయతే ఇతి గాయత్రీ." స్తోత్రము చేయువానిని రక్షించునది గాయత్రి యని భావము. గాయత్రిని మించిన మంత్రము లేదు - "న గాయత్ర్యాః పరం మంత్రమ్." ఈ గాయత్రీ మహా మంత్రమునకు విశ్వామిత్రుఁడు ఋషి. సూర్యమండలాంతర్వర్తియైన నారాయణుఁడు దేవత. గాయత్రీమంత్రము జగత్కారణుఁడైన పరమేశ్వరుని గూర్చిన ధ్యానరూపము. దీనిని జపించి బుద్ధివృత్తులను లెస్సగాఁ బ్రవర్తింపఁ జేసికొనుట ఆవశ్యకము, అందఱకు నది సాధ్యము కాదేమోనని కరుణామయుఁడగు వాల్మీకి రామాయణమున గాయత్రి మంత్రమును నిక్షేపించెను. రామాయణమునఁ గూడఁ బ్రధాన ఋషి విశ్వామిత్రుఁడు. సూర్యవంశ సంజాతుఁడు శ్రీరాముఁడు దేవత. గాయత్రీ బీజాక్షరములను వేయి శ్లోకముల కొకటిగాఁ బ్రతిపాదించినాఁడు. ఈ రామాయణమును చదువుటచే గాయత్రీ జపించిన ఫలము సిద్ధించును."[3] అని శ్రీ భాష్యం అప్పలాచార్యులవారు సంభావించి సమన్వయించిరి.

యోగశాస్త్రము :

రామాయణమును యోగపరముగాఁ గూడ యోజించినవారు కలరు. అందు డా॥ ఇలపావులూరి పాండురంగారావు గారు రామాయణ పరమార్థమును గూర్చి యిట్లు వివరించిరి - "తాత్త్విక దృక్పథంలో చూస్తే రామాయణం శారీరక మీమాంసంగా కనిపిస్తుంది. వేదాంతులు తమ వేదాంతదర్శనాన్ని శారీరక మీమాంస అనే పేర్కొన్నారు. దీనినే బ్రహ్మసూత్రం అని కూడా అన్నారు. సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ బ్రహ్మసూత్రం రామాయణంలో కనిపిస్తుంది. షట్కాండల్లో సంచరించే రామాయణ మహాయనంలో షట్చక్రాలు గోచరిస్తాయి. కైకేయి వర యాచనలో మూలాధారం, చిత్రకూటంలో స్వాధిష్ఠానం, అత్రి, అనసూయ, అగస్త్యుల ఆతిథ్యంలో మణిపూరం, కబంధ వధలో అనాహతం, పంపాసందర్శనంలో విశుద్ధి, సుగ్రీవాజ్ఞలో ఆజ్ఞాచక్రం స్పష్టంగా కనిపిస్తాయి. సీతా సందర్శనమే సహస్రారబిందు దర్శనం. రామాయణంలోని పాత్రలపేర్లు కూడా / వాలి, సుగ్రీవుఁడు, కుంభకర్ణుఁడు, శూర్పణఖ, దశకంఠరుఁడు, కబంధుఁడు, త్రిశిరుఁడు / శరీరంలోని అవయవాలకు సంబంధించి ఉండటం గమనించదగ్గవిషయం. రాముఁడు ప్రాణస్వరూపుఁడు. సీతాదేవి ప్రణవస్వరూపిణి. ప్రణవసమేతమైన ప్రాణసంచారమే సీతారాముల అయనం. అదే రామాయణం."[1]

అధ్యాత్మికత :

పరమార్థ దృష్టితోఁ జూచినప్పుడుఁ రాముడుఁ పరబ్రహ్మ. సీత శక్తిస్వరూపిణి. వాల్మీకమునకు వ్యాఖ్యాప్రాయములైన "అధ్యాత్మ రామాయణాది" గ్రంథములీ విషయమును విదిత మొనర్చినవి.

వాల్మీకే ర్మునిసింహస్య కవితా వనచారిణః
శ్రుణ్వన్ రామకథానాదం కో నయాతి పరాంగతిమ్.

ఇట "పరాంగతిమ్" అనునది పరలోకగమన మనియు, పరమపద మనియు నర్థద్వయము నిచ్చుచున్నది. దీనినిబట్టి "వాల్మీకి కవిగా బాహ్యమును, మునిగా అంతరర్థమును ప్రతిపాదించెనని తెలియుచున్నది. కావ్యగానమున మాధుర్యము, ఆత్మతత్త్వమను ప్రతిపాదించుటలో గాంభీర్యము రామాయణమున కలవని తెలియుచున్నది.

1. షోడశి - గుంటూరు శేషేంద్రశర్మ, పు॥ లు 104-10
2. " , పు. 87
3. సుందరకాండము - తత్త్వదీపిక, పు. 13

1. రామాయణ పరమార్థం, పు. 69

వాల్మీకి కోకిలయై రామకథను మధురముగ పలికెను. మునిసింహమై ఉపనిషదర్థములను గర్జించెను. మొదటి స్వరము చెవికిని, మనసునకును తరుగని హాయిని ప్రసాదించును. రెండవది శాశ్వతమగు స్థానమును చేకూర్చును." .... శ్రీ రామాయణము బాహ్యముగ రామకథ. అంతరముగ ఆత్మకథ. రామాయణము బాహ్యముగ కావ్యము. అంతరముగ ఉపనిషత్తు."[1]

తత్త్వదృష్టితో గాంచినచో రామాయణము నందలి పాత్రలు ప్రతీకాత్మత్వమును భజించి పరతత్త్వోన్ముఖమైన సమన్వయముతో నొప్పుచున్నవి.

తాత్త్వికులు రామాయణాంతరర్థము నిట్లు వెలయించిరి-"రామాయణము నందు చెప్పబడిన కథ యంతయు ప్రతి శరీరమునకు గలదు. మోహము అజ్ఞానము నను సంసారము సముద్రము. రాగద్వేషాదులు రాక్షసులు. శాంతి సీత. ఆత్మారాముడు రాముడు. పంచవటి పరిశుద్ధాంతఃకరణము. తమోద్రిక్తత, మాయామోహము రావణుడు. ఈతడే జీవి. లంక దేహము. విషయవ్యాపారము అశోకవృక్షవాటిక.[2]

ఈ విధముగ రామాయణము ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక మార్గముల నుపాదేయ మగుచున్నది. బ్రహ్మ ప్రేరేపించి, నారదుడుపదేశించిన కావ్యము రామాయణము. వాల్మీకి దివ్యజ్ఞానమున నద్దానిని దర్శించి మధుర మధురాక్షరముగా నక్షరత్వము నాలపించి జగద్వంద్యుడైనాడు. రామాయణము శాశ్వతమైన యఖండకీర్తి నంది జగమునవ్యాప్తి చెందినది. అట్టి రామాయణ వైభవ మింతింతనరానిదై యున్నది. ఎందరెన్నిగతుల వర్ణించిన నది రమణీయతను బంచి యిచ్చుచునే యున్నది.

జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః।
నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్॥

---

1. సుందరకాండము - తత్త్వదీపిక, పు. 10
2. హనుమ - శ్రీ దివాకరుని వెంకట సుబ్బారావు, పు. 5

శ్రీ లక్ష్మీగణపతయే నమః

ఆదిత్య జ్యోతిషాలయమ్

సిద్ధాంతి : శ్రీ తూములూరు లక్ష్మీనారాయణశాస్త్రి

H. O. :
ఉప్పులూరు
(Via) కంకిపాడు
(కృష్ణా జిల్లా)

B. O. :
జైహింద్ టాకీస్ వద్ద
C/o. కొత్తా రామాలయము
గవర్నర్ పేట
విజయవాడ - 2.